నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, బుధవారం 1 మే 2024 | SIDDIPET


సిద్దిపేటలో జరిగిన ఆటో యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న తన్నీరు హరీశ్‌రావు

రాయపోల్ రోడ్ షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన వెంకట్రామిరెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి

సిద్దిపేటకు వచ్చే అర్హత రేవంత్‌కు లేదు

ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతవ్..

- కొడంగల్‌కు తరలించిన వెటర్నరీ కాలేజీని తిరిగి ఇచ్చాకే సిద్దిపేటలో అడుగుపెట్టాలి
- కరెంట్ సరఫరా చేయలేకే ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు, ట్రాన్స్‌ఫర్లు
- 28మంది ఆటో కార్మికులు చనిపోతే రేవంత్‌కు చీమకుట్టినట్లు లేదు...
- సిద్దిపేటలో ఆటో యూనియన్ కార్మికుల సమావేశంలో హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 30: రేవంత్‌కు సిద్దిపేటకు వచ్చే అర్హతే లేదని, సిద్దిపేటకు మంజూరై సగం పనులు పూర్తయిన వెటర్నరీ కాలేజీని కొడంగల్‌కు తరలించుకుపోయిన రేవంత్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. మంగళవారం సిద్దిపేటలో బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఆటో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ముందుగా కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులు హరించుకుపోయాయన్నారు. బీజేపీ కార్మిక వ్యతిరేక పార్టీ అన్నారు. బీజేపీ కార్మికుల హక్కుల కోసం కాకుండా అదానీ, అంబానీల కోసం పని చేస్తుందన్నారు. కరెంట్ సరిగా సరఫరా చేయలేక అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు, ట్రాన్స్‌ఫర్లు చేసి వేధిస్తుందని దుయ్యబట్టారు. ఉద్యోగులు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు 100 రోజుల్లో అమలుచేస్తామని బాండ్ పేపర్లు రాసిచ్చి ఇప్పుడు అమలు చేయడం లేదన్నారు. మళ్లీ దేవుళ్లపై ఓట్లు పెడుతూ ప్రజలను మోసం చేయాలని చూస్తుందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వారి మోసపు హామీలను ఆమోదించినట్లు అవుతుందని, కాంగ్రెస్ పాలన వల్లే ఆటో కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. 28మంది ఆటో కార్మికులు చనిపోతే రేవంత్‌రెడ్డికి చీమకుట్టినట్లు కూడా లేదని, కనీసం వారి కుటుంబాలను పరామర్శించలేదన్నారు. అభివృద్ధిని అడ్డుకున్న బీజేపీ అభ్యర్థి రఘునందన్‌కు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. సిద్దిపేట అంటేనే బిఆర్ఎస్ అడ్డా అన్నారు. వెటర్నరీ కాలేజీని సిద్దిపేటకు మంజూరు చేసిన తర్వాతే రేవంత్‌రెడ్డి సిద్దిపేటకు వచ్చి ఓట్లు అడగాలని హరీశ్‌రావు అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి, పాల సాయిరాం, ఎల్లయ్య, ఆటో యూనియన్ నాయకులు శ్రీనివాస్, రామరాజు, మల్లేశం తదితర నాయకులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన ఆటో కార్మికులు

రేషన్ కార్డుల రద్దుకు కుట్ర

మెదక్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

- ప్రచారంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటువేస్తే రేషన్ కార్డులను రద్దు చేసి, ప్రజా సంక్షేమ పథకాలను ఆపేస్తారని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం కూచన్‌పల్లి, ముత్తాయికోట, మద్దుల్వాయిలో ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల రేషన్ కార్డులను రద్దు చేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ భూములు, ఇల్లు, కారు ఉన్నాయనే నెపంతో రేషన్ కార్డుల రద్దుకు కుట్ర పన్నుతున్నారన్నారు. నాలుగు నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులకు రెండు నెలల పింఛన్ ఎగవేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుల కోసం ఉంచిన రూ. 7000 కోట్లను కాంట్రాక్టర్లకు పంచిపెట్టి కమిషనర్ పేరిట ప్రభుత్వ పెద్దలు లబ్ది పొందారని దుయ్యబట్టారు. ఇలాంటి వారికి ఓటు వేస్తే రాబోయే కాలంలో ప్రజలు మరిన్ని కష్టాల పాలయ్యే అవకాశం ఉందన్నారు. నిత్యం ప్రజల సంక్షేమం కోసం, రైతుల కోసం పాటుపడే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి రూ.100 కోట్లతో పేదల సంక్షేమం కోసం ట్రస్ట్ ఏర్పాటు చేయనున్నట్లు సుభాష్‌రెడ్డి తెలిపారు. కారు గుర్తుకు ఓటువేసి మన బతుకులను మనమే బాగు చేసుకుందామని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. ప్రచారంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి, ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు మాణిక్యరెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాముడి జపంతో బీజేపీ రాక్షస పాలన

హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్/ అక్కన్నపేట, ఏప్రిల్ 30: రాముడి జపంతో దేశంలో బీజేపీ రాక్షస పాలన చేస్తున్నదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా హుస్నాబాద్ మండలంలోని పందిల్ల, అక్కన్నపేట మండలకేంద్రంలో నిర్వహించిన పబ్లిక్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. కుల, మతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీని ఈ ఎన్నికల్లో బొంద పెట్టాలన్నారు. ఆగస్ట్ 15 తర్వాత రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఆరు గ్యారెంటీలను ఎన్నికల తర్వాత వందశాతం అమలు చేస్తామన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నియోజకవర్గానికి ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే అంబేద్కర్ సాక్షిగా అభివృద్ధి విషయంలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, బొలిశెట్టి శివయ్య, కేడం లింగమూర్తి, ముత్యాల సంజీవరెడ్డి, జైపాల్‌రెడ్డి, మంజులారెడ్డి, అయిలయ్య, బంక చందు పాల్గొన్నారు

రివర్స్‌గేరులో రేవంత్ పాలన

నాడు ఓటుకు నోటు.. నేడు ఓట్లకు దేవుళ్లపై ఒట్లు

- ఒక్క హామీ సరిగ్గా అమలు చేయడం లేదు
- ప్రజలను ఆగం చేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు
- రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో రోడ్‌షో
- బ్రహ్మరథం పట్టిన ప్రజలు

రాయపోల్, ఏప్రిల్ 30: రాష్ట్రంలో రివర్స్ గేరులో రేవంత్ పాలన కొనసాగుతున్నదని, కేసీఆర్ అమలు చేసిన పథకాలు పేదలకు అందకుండా నాడు ఓటుకు నోటు, నేడు ఓట్లకు ఒట్లు పెట్టుకుంటూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు తిరుగుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం రాత్రి రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి రోడ్‌షోల్లో పాల్గొని మాట్లాడారు. కొత్త పథకాలు ఏమోగానీ, ఉన్న పథకాలను ఆగం చేశారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరిన కేసీఆర్‌పై ఇష్టారీతిగా మాట్లాడుతున్నాడని, ఇది పద్ధతేనా అంటూ ప్రశ్నించారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించి రైతులకు సాగు, తాగునీరు, కరెంట్‌తో పాటు అనేక సంక్షేమ పథకాలు అందించిన కేసీఆర్‌ను అవమానించిన రేవంత్‌రెడ్డికి ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీల బాండ్‌ను బౌన్స్ చేసిన ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కరెంట్, నీళ్లు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వారి అబద్ధాలకు సమర్థించినట్లే అవుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధి కావాలంటే వచ్చిన తెలంగాణను నిలుపుకోవాలన్నారు. మాయమాటలు చెప్పే రఘునందన్‌రావుకు మరోసారి దుబ్బాక ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. ప్రజలకు ఏమీ చేయలేని బీజేపీ నాయకులు క్యాలెండర్లతో తిరుగుతున్నారన్నారు. బీజేపీ వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు పెరిగాయాన్నారు. రూ.100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేసి అండగా నిలుస్తానన్న వెంకట్రామిరెడ్డిని గెలిపించి, ప్రశ్నించే గొంతును పార్లమెంట్‌కు పంపించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు.

రాయపోల్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న హరీశ్‌రావు

దౌల్తాబాద్‌లో రోడ్‌షోకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

మోసగాళ్లకు బుద్ధి చెప్పాలి: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

కేసీఆర్ చొరవతోనే రాయపోల్ మండలం ఏర్పడిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కరువు, కాటకాలకు నిలయమైన రాయపోల్ మండలంలో గోదావరి జలాలు పారించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీజేపీ నాయకుల మాటలకు మరోసారి ప్రజలు మోసపోకుండా వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎంపీగా గెలిస్తే హరీశన్నతో కలిసి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. రాయపోల్ మండలం ఉద్యమాలకు గడ్డ అని, గులాబీ అడ్డా అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

తాటాకు చప్పళ్లకు భయపడేది లేదు: వెంకట్రామిరెడ్డి

ఓటమిని జీర్ణించుకోలేక తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్న రఘునందన్‌రావుకు భయపడేది లేదని ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. తనపై అక్కసుతో ఫిర్యాదులు చేస్తున్నారని, తన జీవితం తెల్ల కాగితమని పేర్కొన్నారు. 11 ఏండ్లుగా మీతో కలిసి పనిచేశానని, నేడు ఎన్నికయ్యే అవకాశం కల్పించాలన్నారు. రఘునందన్‌రావు ప్రజలను మోసం చేశాడని, మరోసారి ఓట్ల కోసం వస్తున్నాడని ఆయనను నిలదీయాలన్నారు. ప్రజా సేవ కోసం వచ్చానని, ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే అందుబాటులో ఉండి రుణం తీర్చుకుంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, ఎంపీపీ కల్లూని అనితాశ్రీనివాస్, జడ్పీటీసీ యాదగిరి, సోలిపేట సతీశ్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, చిందం రాజ్‌కుమార్, కత్తి కార్తీకగౌడ్, ఇప్ప దయాకర్, దౌల్తాబాద్ మండలాధ్యక్షుడు రహిమొద్దీన్, ఎంపీపీ సంధ్య, జడ్పీటీసీ రణం జ్యోతి, సమన్వయ కర్త రణం శ్రీనివాస్ గౌడ్, రెండు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దు

- రేవంత్‌రెడ్డివి అయితే తిట్లు.. లేకపోతే దేవుడి మీద ఒట్లు..
- హామీల అమలు లేదు.. రుణమాఫీ ఊసేలేదు..
- గజ్వేల్ గౌరవం పెంచింది కేసీఆర్..
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి
- మీ కోసం కొట్లాడుతా..
- జగదేవ్‌పూర్ రోడ్డుషోలో మాజీమంత్రి హరీశ్‌రావు

జగదేవ్‌పూర్ ఏప్రిల్ 29: కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండల నాయకులతో కలసి మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వం దొడ్డిదారిన అధికారంలోకి వచ్చి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. నాలుగు నెలల పాలనలో రుణమాఫీ, రైతుబంధు, రూ.నాలుగు వేల పింఛన్, మహాలక్ష్మి కింద రూ.2500 ఇవ్వకుండా కేసీఆర్ తెచ్చిన అనేక పథకాలను ఎత్తేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి అయితే కేసీఆర్‌ను తిట్టడం లేకపోతే దేవుడి మీద ఒట్లు వేయడం తప్ప, ఒక్క పని చేయలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో గజ్వేల్ గౌరవం పెంచింది కేసీఆర్ కాదా అన్నారు. గజ్వేల్ అభివృద్ధి కోసం విడుదల చేసిన రూ.743 కోట్ల గడా నిధులు, రూ.45 కోట్ల ఎస్డీఎఫ్ నిధులు వెనక్కి తీసుకున్నారని హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తావా.. లేక రాజీనామా చేస్తావా అంటే రేవంత్‌రెడ్డి పారిపోయిండని ఎద్దేవా చేశాడు. ప్రజలను మోసం చేసే కాంగ్రెస్ నాయకులను నమ్మి మళ్లీ మోసపోవద్దని ప్రజలకు సూచించారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమి లేదన్నారు. వెంకట్రామిరెడ్డి మంచి వ్యక్తి అని, ప్రజలకు సేవచేసే గుణం ఉన్నదని, ఆయనను గెలిపిస్తే గజ్వేల్ మరింత అభివృద్ధి చెందుతుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. వెంకట్రామిరెడ్డిని గెలిపించి బలాన్నివ్వండి.. పేగులు తెగేదాకా కొట్లాడుతానన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలు ఇచ్చేదాకా అసెంబ్లీలో కొట్లాడి, రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కి రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి, కొండపోచమ్మ మాజీ చైర్మన్లు శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జగదేవ్‌పూర్ ఎంపీటీసీ కవిత, మండల కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, సీనియర్ నాయకులు యాదవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కనకయ్య, నాగరాజు ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు, భారీగా హాజరైన ప్రజలు

పరారీలో బీజేపీ నాయకులు

- ఎస్సీలపై దాడి ఘటనలో కేసు నమోదు

సిద్దిపేట, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎస్సీలపై దాడి కేసులో పలువురు బీజేపీ నాయకులపై కేసులు నమోదయ్యాయి. దీంతో పలువురు పరారీలో ఉన్నారు. బీజేపీ సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి, పత్రి శ్రీనివాస్‌తోపాటు మరికొందరిపై 447, 427, 324, 307, 384, 379, 504, 506, 34, 3(1)(ఆర్)(ఎస్)3(2), హత్యాయత్నం, బెదిరింపులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద సిద్దిపేట టూటౌన్ పోలీస్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. సిద్దిపేట పట్టణానికి చెందిన గరికమొక్కుల రాజేశ్ స్థానిక మెదక్ రోడ్డులోని రాఘవేంద్రనగర్‌లోని సాయికృష్ణ వెంచర్ పక్కన 8 నెలల క్రితం సర్వే నెం.1999లో 120 గజాల ప్లాట్‌ను కొనుగోలు చేశాడు. ఆ స్థలంలో భవన నిర్మాణానికి మున్సిపాలిటీ నుంచి అనుమతి పొంది, బ్యాంకు రుణం సైతం తీసుకున్నాడు. 4 నెలల క్రితం గృహ నిర్మాణానికి భూమిపూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించాడు. ఈ క్రమంలో 19న రాత్రి 11 గంటల ప్రాంతంలో సెంట్రింగ్ పని ముగించుకుని అక్కడే భోజనం చేసి మిత్రులతో కలిసి విశ్రాంతి తీసుకున్నాడు. ఆ సమయంలో బీజేపీ నాయకులు దూది శ్రీకాంత్‌రెడ్డి, పత్రి శ్రీనివాస్ మరికొందరితో వచ్చి ఆయనతో గొడవకు దిగారు. ముందుగా సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగింది. ఈ క్రమంలో దూది శ్రీకాంత్‌రెడ్డి, పత్రి శ్రీనివాస్ తన అనుచరులతో కలసి రాజేశ్, అతడి స్నేహితులపై కర్రలతో దాడికి దిగారు. వారి కార్ల అద్దాలను ధ్వంసం చేశారు. పిల్లర్ల దశలో ఉన్న ఇంటి నిర్మాణం సైతం జేసీబీతో కూల్చివేయించారు. దీంతో బీజేపీ నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేయడంతో వారు పరారీలో ఉన్నారు. దళితులపై బీజేపీ నాయకులు భౌతిక దాడులకు పాల్పడడాన్ని అందరూ ఖండిస్తున్నారు.

వట్‌పల్లి: వెంకట్‌ఖ్వాజా ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేస్తున్న గాలి అనిల్‌కుమార్, క్రాంతికిరణ్

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

వట్‌పల్లి, ఏప్రిల్ 30: తెలంగాణ ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం వట్‌పల్లిలోని వెంకట్‌ఖ్వాజా ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేసి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్, మాజీఎమ్మెల్యే క్రాంతికిరణ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, కంటికి కనపడలేదన్నారు. ఉద్యమాలు జరుగుతుంటే పక్కదేశాల్లో తలదాచుకున్నారని ఎద్దేవా చేశారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో తెలంగాణ ప్రజలకు మోసం చేసి గెలిచిందన్నారు. అలాంటి కాంగ్రెస్‌ను ప్రశ్నించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకొని కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్ రెడ్డి, అందోల్ ఎన్నికల ఇన్‌చార్జి మాణిక్యం, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.